సాక్షి
మెదక్
మంగళవారం ౹ 12 ౹ మార్చి ౹ 2024




సంత.. రోడ్డంతా

హుస్నాబాద్ పట్టణంలో ప్రతీ శుక్రవారం వారాంతపు సంత జరుగుతుంది. ఈ అంగడికి ఇక్కడి ప్రజలతోపాటు హైదరాబాద్ నుంచి వ్యాపారులు, రైతులు వస్తారు. వివరాలు 8లో ▸



విద్యార్థిని చితకబాదిన...

ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదడంతో అతడి కాలు విరిగింది. ఈ ఘటన టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దనూర ప్రాథమిక పాఠశాలలో జరిగింది. వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం జరిగిన మొదటి సంవత్సరం విద్యార్థులకు భౌతిక శాస్త్రం-1, అర్థ శాస్త్రం-1 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈఓ సత్యానారాయణ తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 7,544 మంది విద్యార్థులకు గానూ 7,066 మంది హాజరయ్యారని, మరో 478 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. దీంతో విద్యార్థుల హాజరు శాతం 94 నమోదైనట్లు తెలిపారు. జిల్లాలోని కొల్చారం, కౌడిపల్లి, పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించినట్లు పేర్కొన్నారు. చిన్నశంకరంపేట, చేగుంట, వెల్దుర్తి, తూప్రాన్, కొల్చారం, కౌడిపల్లి, నర్సాపూర్ తదితర సెంటర్లను జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు.

జాతర ఆదాయం రూ.61.18 లక్షలు



ఏడుపాయల హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతర ఆదాయం ఈ సారి రూ.61,18,186 వచ్చినట్లు పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో 14 రోజుల హుండీ లెక్కించగా రూ.24,75,366లతో పాటు మిశ్రమ బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఒడి బియ్యం టిక్కెట్ల ద్వారా రూ.77,950లు, కేశ ఖండనం రూ.59,250లు, స్పెషల్ దర్శనం (రూ.20) రూ.2,68,250లు, స్పెషల్ దర్శనం (రూ.100) రూ.7,27,200లు, లడ్డూ రూ.17,70,000, పులిహోర రూ.7,39,900 ఆదాయం వచ్చినట్లు వారు వివరించారు. గత జాతరతో పోలిస్తే రూ.2,74,403 అధికంగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ శివరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

3 రోజులు.. రూ.కోటి మద్యం తాగేశారు..

కొల్చారం(నర్సాపూర్): జిల్లాలోని ఏడుపాయల వన దుర్గాదేవి జాతరలో మద్యం ఏరులై పారింది. మూడు రోజుల వ్యవధిలో పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లిలోని 2 మద్యం దుకాణాలు, కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి పరిధిలోని మద్యం దుకాణం, చిన్నఘనాపూర్ ఐఎంఎల్ డిపో ద్వారా మద్యం అమ్మకాలు జరిగాయి. మొత్తం విలువ రూ. కోటి 95 వేలు అని డిపో వర్గాలు తెలిపాయి.


గృహజ్యోతి కోసం బారులు



ఎంపీడీఓ ఆఫీస్ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు

కౌడిపల్లి(నర్సాపూర్): గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ బిల్లు రాకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయం కౌంటర్ వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు అర్హులైనప్పటికీ తమకు పథకం అమలు కాలేదన్నారు. ఆపై ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చామన్నారు. తెల్లరేషన్‌కార్డు ఆధారంగా అర్హులకు 200 యూనిట్ల వరకు పథకం వర్తిస్తుందని అర్హులు ఆందోళన చెందవద్దని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. అంతకు ముందు అధికారులు మండల సర్వసభ్య సమావేశంలో ఉండటంతో సమావేశం ముగిసే వరకు వారందరూ వేచిఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



మెదక్ కలెక్టరేట్: అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు విదేశాల్లో చదివే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం.. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం అమలు చేస్తోందని జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో భాగంగా అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్ కొరియా దేశాల్లో గల పేరొందిన విశ్వ విద్యాలయాల్లో పీజీ ఆపై ఉన్నత విద్యనభ్యసించే వారికి ఆర్థికసాయం అందజేస్తామని పేర్కొన్నారు. పథకానికి ఎంపికైన అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.20 లక్షల ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమాచారం కోసం 77310-28683 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



భక్తులకు దర్శనమిస్తున్న వనదుర్గమ్మ

ముగిసిన ఏడుపాయల జాతర

అధికారుల సమన్వయంతో విజయవంతం

పాపన్నపేట(మెదక్): మహాశివరాత్రి సందర్భంగా ప్రారంభమైన ఏడుపాయల జాతర ముగిసింది. మూడు రోజుల పాటు సరదాగా గడిపిన భక్తులు దుర్గమ్మా వెళ్లొస్తామమ్మా అంటూ తమ ఇళ్లకు మళ్లారు. పాలక వర్గ సభ్యులు, జిల్లా స్థాయి అధికారుల సమన్వయం వల్ల కార్యక్రమం విజయవంతమైంది. జాతరలో 50కి పైగా పిల్లలు తప్పిపోగా పోలీసులు వారిని వారి తల్లితండ్రులకు అప్పజెప్పారు. జాతరలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 5 బెల్ట్ షాప్‌లపై కేసులు నమోదు చేశారు. కాగా ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్చర్లకు చెందిన రవి దుర్గమ్మ దర్శనానికి వచ్చి ఏడు పాయల్లోని రెండో బ్రిడ్జి వద్ద (కొల్చారం మండలం) నీట మునిగి చనిపోయాడు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు విలువైన సేవలందించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. కాగా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సోమవారం దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు, పూజారులు స్వాగతం పలికారు. ఈయన వెంట కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు గోవింద్, ప్రశాంత్‌రెడ్డి, సుప్రభాత్‌రావు, గంగా నరేందర్, నర్సింలుగుప్తా ఉన్నారు.

ఒక్క దరఖాస్తూ పెండింగ్ ఉండొద్దు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు ఒక్కటి కూడా పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకు ముందు ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై రివ్యూ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న 250 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ మెదక్, హైదరాబాద్‌లోని ప్రజాభవన్ లో నిర్వహించిన ప్రజావాణికి ఇప్పటి దాకా అందిన దరఖాస్తుల్లో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? వాటికి సరైన కారణాలు తెలుపుతూ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లో జరిగే ఇదే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. మొత్తం 100 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ శాఖ(35), డీఆర్డీఓ (11), ఇతర శాఖలకు (54)లు వచ్చాయన్నారు.

పదికి పకడ్బందీ ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. 10,300 విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 68 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 55 మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పరిశీలిస్తాయని వివరించారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్య అధికారులు కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమయ్యే మాత్రలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్షల సమయానుగుణంగా బస్సులు నడిపించాలని సూచించారు. అనంతరం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గల ఈవీఎంల భద్రతా కేంద్రాన్ని సందర్శించారు. కళాశాలకు సెలవు ప్రకటించిన అనంతరం ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కోసం రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేశ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, మైనింగ్ ఏడీ జయరాజ్, ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా లేబర్‌కార్డు

జిల్లాలో 24,304 మంది పొందారు

- ప్రమాద మరణానికి రూ. 6.30 లక్షల పరిహారం
- సాధారణ మరణం రూ. 1.30 లక్షలు





మెదక్: భవన, నిర్మాణ రంగాల్లో పని చేసే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న లేబర్ గుర్తింపు కార్డులు ఎంతో ధీమా ఇస్తున్నాయి. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే ఈ కార్డు తప్పనిసరి. తాపీ మేస్త్రి, ఎలక్ట్రిషన్లు, ప్లంబర్లు, పెయింటర్లు, టైల్స్, వడ్రంగి, వెల్డింగ్, వడ్డెర, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు లేబర్ కార్డులు జారీ చేస్తుంది. మెదక్ జిల్లాలో 24,304 మంది లేబర్ కార్డులు పొందారు. సుమారు 1,500 మంది కార్మికులు ఈ కార్డు ద్వారా వివిధ రకాల లబ్ధిపొందారు. ఈ కార్డు పొందాలంటే భవన నిర్మాణ రంగంలో పని చేస్తూ 18 ఏళ్ల నిండి 60 సంవత్సరాల లోపు వారు ఉండాలి. లేబర్‌గా నమోదు చేయించుకునే వారు ఏడాదిలో తప్పనిసరిగా 6 నెలలకు తక్కువ కాకుండా భవన, ఇతర నిర్మాణ రంగంలో పని చేసి ఉండాలి. కార్డు పొందిన కార్మికులు ప్రభుత్వం అందించే వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చు.

నమోదు ఇలా

కార్మికులు పనిచేసే ఫొటో, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్, పని వివరాలను సంబంధిత ఫారాన్ని మీ సేవాలో సమర్పించాలి. ఆధార్ నమోదు తర్వాత వేలిముద్ర కూడా వేయాలి. అనంతరం రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, సెల్ నంబర్‌తోపాటు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేస్తారు. ఇందుకోసం నిర్వాహకుడికి గాను రూ.110 చెల్లించాలి. పూర్తయిన దరఖాస్తు ఫారాలను జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో అందజేయాలి. తర్వాత అధికారులు పరిశీలించి కార్డును జారీ చేస్తారు. ఈ లేబర్ కార్డు ఐదేళ్ల వరకు పని చేస్తుంది. రెన్యువల్ చేయించుకోకపోతే సభ్యత్వం కోల్పోతారు.

ప్రయోజనాలివే

లేబర్ కార్డు ఉన్న పిల్లల వివాహ కానుకగా రూ.30 వేలు, ప్రసవం కింద రూ.30 వేలు ఇస్తారు. నమోదైన కార్మికుడి భార్యకు, మహిళా కార్మికులకు, కార్మికుడు లేదా కార్మికురాలకు కనుక ఇద్దరు కుమార్తెలు ఉంటే ఒక్కొక్కరికీ 2 కాన్పుల వరకు వర్తిస్తుంది. లేబర్ కార్డు పొందిన కార్మికుడు సాధారణ మరణం పొందితే రూ. 1.30 లక్షలు, ప్రమాదం జరిగి చనిపోతే రూ.6.30 లక్షల చెల్లిస్తారు. దీంతోపాటు ప్రమాదం వల్ల అంగవైకల్యం ఏర్పడితే దాని ఆధారంగా పరిహారం ఇస్తారు. ఒక వేళ దివ్యాంగుడైతే అతనికి న్యాక్‌సెంటర్ ద్వారా శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన 15 రోజులపాటు రోజుకు రూ.300 చెల్లించి, భోజన సదుపాయం కల్పిస్తారు. తన కాళ్లపై తాను నిలబడే విధంగా తీర్చిదిద్దుతారు.

తప్పనిసరిగా తీసుకోవాలి

భవన నిర్మాణ రంగ సంస్థలో పని చేసే కార్మికులు తప్పనిసరి లేబర్ కార్డు తీసుకోవాలి. దీంతో వారితోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనం ఉంటుంది. జిల్లాలో 24,304 మంది కార్డులు పొందగా వారిలో సుమారు 4 వేల మంది కార్మికులు రెన్యువల్ చేయించుకోవడం లేదు. తప్పనిసరిగా సంబంధిత ధ్రువపత్రాలతో మీసేవా కేంద్రానికి వెళ్లి రెన్యూవల్ చేయించుకోవాలి. కొత్తవారు నూతనంగా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– యాదయ్య, జిల్లా కార్మికశాఖ సహాయ అధికారి

రేపు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

తూప్రాన్: తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే మెదక్ జిల్లా జట్ల ఎంపిక కోసం ఈ నెల 13న మనోహరాబాద్ తెలంగాణ క్రీడా ప్రాంగణంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కొడిప్యాక నారాయణ గుప్తా సోమవారం తెలిపారు. క్రీడాకారులు 2009 జనవరి 1వ తేదీ తరువాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 8 గంటల లోపు ఆక్రీడా ప్రాంగణానికి హాజరు కావాలని కోరారు. వివరాలకు 81065-55942 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్‌లోపు సీఎంఆర్

మిల్లర్లకు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: ఏప్రిల్ నెలాఖరు లోగా 2021-22కు సంబంధించిన రబీ, వానాకాలానికి చెందిన రైస్(సీఎంఆర్ కస్టమ్ మిల్లింగ్ రైస్) అందించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని రైస్ మిల్లర్లతో కలిసి ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిల్లర్లు 2022-23 యాసంగి, రబీ ధాన్యం వెనువెంటనే అప్పగించేలా సివిల్ సప్లయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు ఆదర్శనీయంగా ఉండాలని సూచించారు. 2021-22లో రబీ, 2021-22లో వానాకాలం రైస్‌ను ఏప్రిల్ నెలాఖరులోగా డెలివరీ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. అప్పటికి పెండింగ్ ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బియ్యం డెలివరీలో జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నారు. రోజూ వారి బియ్యం డెలివరీలపై సమీక్షించి నివేదికలు అందజేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ హరికృష్ణలకు సూచించారు. సమావేశంలో సహాయ పౌర సరఫరాల అధికారి అరవింద్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రపాల్, డిప్యూటీ తహసీల్దార్లు ప్రణీత రెడ్డి పాల్గొన్నారు.

అర్ధరాత్రి ప్రసవ వేదన



శిశువుతో తల్లి సృజన

- పురిటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణి
- ఆవరణలోనే ఆడ శిశువుకు జననం
- వెల్దుర్తి మండల కేంద్రంలో ఘటన

వెల్దుర్తి(తూప్రాన్): అర్ధరాత్రి ఓ గర్భిణి ప్రసవ వేదనతో విలవిల్లాడింది. ఈ ఘటన వెల్దుర్తి మండల కేంద్రంలో సోమవారం వెలుగుచూసింది. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. వెల్దుర్తి గ్రామానికి చెందిన తాటి సృజన(22)కు ఆదివారం అర్ధరాత్రి పురిటినొప్పులు రాగా.. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే.. గేటుకు తాళం వేసి ఉంది. విషయం తెలుసుకున్న ఆశా వర్కర్.. ఏఎన్ఎం జయంతికి సమాచారం ఇచ్చింది. ఆమె హాస్పిటల్‌కు సమీపంలో మరో ఏఎన్ఎం ఇంట్లో నిద్రించడానికి వెళ్లిందని తెలిసింది. ఆమె వచ్చేలోపు గర్భిణి ఆస్పత్రి గేటు వద్దే ప్రసవవేదనకు గురైంది. చివరికి గేటు తాళం తీసి వార్డుకు తీసుకెళ్తుండగా పురిటినొప్పులు ఎక్కువై ఆస్పత్రి ఆవరణలో మహిళ ఆడశిశువును జన్మనిచ్చింది. కాగా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎన్ఎంకు ఉన్నతాధికారులు మెమో జారీచేశారు.

ఎన్నికల బాండ్ల వివరాలివ్వాలి : సీపీఎం

మెదక్ కలెక్టరేట్: సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఎన్నికల బాండ్ల వివరాలు ఎలక్షన్ కమిషన్‌కు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కె.మల్లేశం, కె.నర్సమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్‌లోని ఎస్‌బీఐ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు వాటిని కొన్న వారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6 లోపు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ బ్యాంక్ చైర్మన్ స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రధాని ఆదేశాల మేరకే బ్యాంక్ పూర్తిగా పని చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ బ్యాంకులను పారదర్శకంగా నిర్వహించాల్సింది పోయి బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. 2019 నుంచి 22,217 బాండ్లను బ్యాంక్ జారీ చేసిందని గుర్తు చేశారు. కొన్ని ఏమో రాజకీయ పార్టీలు నగదు రూపంలోకి మార్చుకున్నాయని తెలిపారు. బీజేపీకి సుమారు 7 వేల కోట్లు బాండ్ల రూపంలో వచ్చాయన్నారు.

ఆరోగ్యం బాగాలేదని..

- రెండో పెళ్లి చేసుకున్నాడు
- ప్రజావాణిలో ఎస్పీకి మహిళ ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: అనారోగ్యం కారణంగా చికిత్స పొందడానికి తాను పుట్టింటికి వెళితే భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని న్యాయం చేయాలంటూ శివ్వంపేట మండలం బిమ్లా తండాకు చెందిన కేతావత్ శిరీషా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ, తనకు ఆరోగ్యం బాగాలేక పుట్టింటికి వెళ్లానన్నారు. ఆరోగ్యం బాగాలేదని సాకుతో తనకే తెలియకుండా భర్త రెండో పెళ్లి చేసుకున్నాడన్నారు. ఈ విషయమై బాధితురాలికి న్యాయం చేయమని శివ్వంపేట ఎస్ఐకి ఎస్పీ సూచించారు. కాగా రామాయంపేట.. గాంధీ రోడ్ లో చికెన్ సెంటర్ నడుపుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నట్లు పట్టణానికి చెందిన మహమ్మద్ రఫీ తెలిపారు. కొంతమంది పాత కక్షలతో దుకాణాన్ని ధ్వంసం చేసి మొత్తం కూలగొట్టారని ఫిర్యాదు చేశారు. తనకు జీవనాధారం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను మానసికంగా వేధిస్తున్నారని, భార్యాపిల్లల్ని చంపుతానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వల్ల ప్రాణహాని ఉందని న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారికి ఎస్పీ ఆదేశించారు.

గ్యారంటీల గడువు ఆరు రోజులే

- హామీలు అమలు చేయకుంటే దంచుతారు.. దించుతారు
- సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలు
- వెంకటాయపల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

తూప్రాన్: వంద రోజుల్లో 6 గ్యారంటీలు, 13 హామీలు అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇక మిగిలింది ఆరు రోజుల గడువు ఉందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. సోమవారం తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్ణీత గడువులోగా ఆరు గ్యారంటీలు, 13 హామీలు అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. నిన్ను ఎవడు దించుతాడనడం లేదని, బిడ్డా.. రేవంత్ హామీలు అమలు చేయకపోతే ప్రజలే దంచుతారు, దించుతారు అని హెచ్చరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు మూడు నెలల కాంగ్రెస్ పాలనకు రెఫరెండమని సీఎం చెప్పారని, ఆరు రోజుల్లో హామీలు అమలు చేయకుంటే ఇక అడ్డుకునుడేనని చెప్పారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని ఊర్లలో బాండ్ పేపర్లు పంచారని, బాండ్ పేపర్ అంటే నమ్మకమని, ఈ కాంగ్రెసోళ్లు బాండ్ పేపర్ల ఇజ్జత్ తీశారని మండిపడ్డారు. వీరు చీటర్లు అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఏనాడు జై తెలంగాణ అనలేదని విమర్శించారు. గెలుపు, ఓటములు ఎవరికీ శాశ్వతం కాదన్నారు. జై తెలంగాణ అనని వాడు సీఎం అయ్యాడని, జై తెలంగాణ అన్నోళ్లను కాలుస్తానంటూ తుపాకి ఎక్కుపెట్టాడని రేవంత్‌పై మండిపడ్డారు. తెలంగాణ రావడంతోనే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడని హరీశ్ గుర్తు చేశారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ పట్టుకొని సీఎం మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీతో కుమ్మక్కై బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని కుట్ర పన్నుతున్నట్లు ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ తెలంగాణ హక్కులను కాపాడుతుందని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలంగాణ వాదాన్ని ఢిల్లీలో గట్టిగా వినిపించుకునేలా బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. చిత్తశుద్ధి ఉంటే రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసిన తర్వాతే ఓటు అడగాలన్నారు. నోరు పెంచుకొని గాయి చేయడం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సూచించారు. రైతులకు నీళ్ల ఇచ్చి కాపాడే ప్రయత్నం చేయాలని, ఏ ముఖం పెట్టుకొని ఓటు అడుగుతావని ప్రశ్నించారు. 24 గంటల కరెంటు 16 గంటలకు మించి సరఫరా చేయడం లేదన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

కేసులకు భయపడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. ఏ కార్యకర్తలు చిన్న ఇబ్బందైనా తనకు ఫోన్ చేయాలని, గంటలో వచ్చి మిమ్మల్ని కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

- 35 టన్నుల 475 కిలోలు స్వాధీనం



బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

పటాన్‌చెరు టౌన్‌: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన పటాన్‌చెరు మండల పరిధిలో రుద్రారం గ్రామ సమీపంలోని రిమ్ జిమ్ దాబా వద్ద చోటు చేసుకుంది. సీసీఎస్ పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు మాట్లాడుతూ.. హైదరాబాద్ కాటేదాన్ నుంచి కర్ణాటకకు లారీలో అక్రమంగా 35 టన్నుల 475 కిలోలు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం పటాన్‌చెరు మండలం రుద్రారం రిమ్ జిమ్ దాబా వద్ద కర్ణాటక పాసింగ్‌కి చెందిన లారీని తనిఖీ చేసి బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. బియ్యాన్ని, లారీని సీజ్ చేసి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. లారీ డ్రైవర్ సాగిర్ బాయ్ వాగ్లే, పూర్మార్ వక్కలను అదుపులోకి తీసుకొని కేసు విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

హెటిరో కంపెనీ స్థలం పరిశీలన



కంపెనీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

తొగుట(దుబ్బాక):మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి శివారులోని హెటిరో డ్రగ్స్ కంపెనీ స్థలాన్ని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సోమవారం పరిశీలించారు. మావోయిస్టుల పేరుతో ఆదివారం కంపెనీ పేదల నుంచి తీసుకున్న భూమిని వారికి అప్పగించాలంటూ హెచ్చరిస్తూ వాల్ రైటింగ్, బ్యానర్ కట్టిన విషయం తెలిసిందే. దీంతో తొగుట సీఐ లతీఫ్‌తో కలిసి ఏసీపీ అక్కడికి చేరుకొని పరిసరాలను తిరిగి చూశారు. వాచ్‌మెన్ రూమ్‌కు మావోయిస్టుల పేరుతో రాసిన రాతను పరిశీలించారు. అలాగే బ్యానర్‌ను ఏసీపీ పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఆనవాళ్ల కోసం పరిసరాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పని చేసింది మావోయిస్టులా.. లేక ఆకతాయిలా.. అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి శవమై లభ్యం



బాలేశ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: చెరువులో గల్లంతైన వ్యక్తి సోమవారం మృతదేహమై లభ్యమైనట్లు నర్సాపూర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మండలంలోని పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన ముద్దం బాలేశ్ (44) పాడి గేదెలకు నీరు తాగించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు ఆదివారం చెరువులో పడి గల్లంతైన విషయం తెలిసిందే. గజ ఈతగాళ్లతో గాలించినా లభ్యం కాలేదు. తిరిగి సోమవారం చెరువులో గాలించగా బాలేశ్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య నర్సమ్మ , కొడుకు ప్రదీప్ ఉన్నారు. నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్‌): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెండి స్వామి(33) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల కుటుంబ సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులతో స్వామి బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి తండ్రి ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

మటన్‌షాపు పెట్టేందుకు ఏడుపాయలకు వెళ్లగా..

- తాళం వేసిన ఇంట్లో చోరీ

టేక్మాల్(మెదక్‌): ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని దనూరలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కటికె ఖాజా మటన్ షాపు దుకాణం నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇంటికి తాళం వేసి 8వ తేదీన మటన్‌షాపు నిర్వహించేందుకు ఏడుపాయలకు వెళ్లాడు. ఇదే అదునుగా చూసిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి 6 తుల బంగారం, 11 తులాల వెండి, రూ.50 నగదు అపహరించారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక, ఏఎస్ఐ దయానంద్ క్లూస్ టీమ్‌తో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఖాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంత.. రోడ్డంతా

హుస్నాబాద్ పట్టణంలో ప్రతీ శుక్రవారం వారాంతపు సంత జరుగుతుంది. ఇక్కడి ప్రజలతోపాటు సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నుంచి వ్యాపారులు, రైతులు వస్తారు. ఇంత భారీ ఎత్తున నడిచే సంత అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. గతేడాది అంగడి ద్వారా రూ.80 లక్షలు మున్సిపాలిటీకి ఆదాయం సమకూరింది. పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా అంగడిలో కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీకి అతిపెద్ద ఆదాయ వనరు అంగడిగా స్థానికులు చెబుతున్నారు.

– హుస్నాబాద్

అసౌకర్యాల నడుమ హుస్నాబాద్ అంగడి

- ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ..
- రోడ్డుపైనే వ్యాపారం.. ట్రాఫిక్ ఇబ్బందులు
- కరీంనగర్, సిద్దిపేట జిల్లాలోనే అతిపెద్ద వారాంతపు సంత
- ఏటా లక్షల్లో మున్సిపాలిటీకి ఆదాయం
- నేడు మున్సిపల్ కార్యాలయంలో అంగడి బహిరంగ వేలం

పశువుల సంతలో ఆవులు, గొర్రెల క్రయ విక్రయాలు



హుస్నాబాద్ పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తా సమీపంలో ప్రతీ శుక్రవారం వారాంతపు సంత జరుగుతుంది. ఇక్కడ అన్ని రకాల తాజా కూరగాయలు చౌకగా లభిస్తాయి. వివిధ జిల్లాల నుంచి రైతులు పండించిన కూరగాయలను తీసుకొచ్చి అమ్ముకుంటారు. వందలాది మంది మహిళలు వచ్చి వారానికి సరిపడే తాజా కూరగాయలను కొనుక్కుంటారు. కూరగాయలే కాకుండా ఇంటికి అవసరమయ్యే ప్రతీ వస్తువు అంగడిలో లభిస్తాయి. దీంతో ప్రతీ ఏటా మున్సిపాలిటీకి అంగడి ద్వారా లక్షల్లో ఆదాయం అంగడి ద్వారా వస్తుంది. ఇంత ఆదాయం ఉన్నా సంతకు ఇప్పటికీ ప్రత్యేక స్థలం లేదు. రోడ్లపైనే పరదాలు వేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. ఒక్కో చిరువ్యాపారుడి నుంచి దుకాణాన్ని బట్టి రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తుంటారు. శుక్రవారం రోజున ఈ అంగడి బజార్ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరుగుతుంది.

లక్షల్లో పశువుల వ్యాపారం..

పశువుల వ్యాపారికి కేరాఫ్ అడ్రస్ హుస్నాబాద్ వారాంతపు సంత. ఆవులు, గేదేలు, గొర్రెలు, మేకలు క్రయవిక్రయాలు జరిపేందుకు వివిధ జిల్లాల రైతులు వస్తుంటారు. అంగడిలో అమ్మబడే పశువు ఒక్కంటికి అమ్మిన వారు రూ.250, కొన్నవారి నుంచి రూ.250 వసూలు చేస్తారు. గొర్రె, మేకలకు రూ.200 చొప్పున రుసుం వసూలు చేస్తారు. ఒక్క రోజునే లక్షల్లో లావాదేవీలు నడుస్తాయి. ఇంత పెద్ద అంగడిలో సౌకర్యాలు లేవు. తాగడానికి నీళ్లు, నీడ ఉండదు. ఎలాంటి రక్షణ లేదు. పశువులకు సైతం తాపడానికి నీటి సౌకర్యం లేదు.

నేడు బహిరంగ వేలం..

2024–25 ఆర్థిక సంవత్సరానికి అంగడి కోసం హుస్నాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఒక్కో గుత్తేదారుడు రూ.5 లక్షలు నగదు చెల్లించి వారాసంత వేలంలో పాల్గొంటాడు. అంగడి వేలం దక్కించుకోవడానికి హుస్నాబాద్‌తోపాటు సిద్దిపేట, జమ్మికుంట, పర్కాల్, నల్లగొండ, కరీంనగర్ నుంచి గుత్తేదారులు పోటీ పడుతారు. ప్రతీఏటా గుత్తేదారులు సిండికేట్ కావడంతో మున్సిపల్‌కు ఆదాయానికి గండికొడుతున్నారు. గతేడాది అంగడిని రూ.80 లక్షలకు దక్కించుకున్నారు. ఈసారి కూడా సిండికేట్ అయ్యి ఆదాయానికి గండికొడుతారా, గతం కంటే ఎంత వరకు ఆదాయం పెరుగుతుందో వేచి చూడాలి.



రోడ్డుపైనే హుస్నాబాద్ వారాంతపు సంత

సౌకర్యాలు కల్పిస్తాం



వారాంతపు సంతలో సౌకర్యాలు కల్పిస్తాం. వేసవి కావడం వల్ల తాగునీటి వసతి ఏర్పాటు చేస్తాం. వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం జరుగుతుంది. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తి కాగానే శుక్రవారం జరిగే సంతను తరలిస్తాం. పశువుల సంత వద్ద రైతుల కోసం ప్రత్యేక షెడ్లు నిర్మాణాలు చేపడుతా. అంగడికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

అన్ని రంగాల్లో తమదైన ముద్ర

సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలతోపాటు ఇతర రంగాల్లో తమదైన ముద్ర వేస్తున్నారని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో సీపీ వేడుకలు నిర్వహించారు. సీపీ కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ప్రతిరోజూ మహిళా దినోత్సవం జరుపుకునే రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కమిషనరేట్ పరిధిలో మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఉత్తమ సేవలు అందించిన పలువురు మహిళ సిబ్బందిని సీపీ శాలువా, మెమొంటోతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, మహిళా పోలీసు కానిస్టేబుళ్లు, భరోసా సెంటర్, స్నేహిత మహిళా సపోర్టు సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా : డ్రైవర్ మృతి

అల్లాదుర్గం(మెదక్‌): ప్రమాదవశాత్తు టిప్పర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజీ అహ్మద్ (44) మండల పరిధిలోని ముస్లాపూర్ శివారులోని కంకర మిషన్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. క్రషర్ రాళ్ల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అహ్మద్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కారు అదుపుతప్పి.. చెట్టును ఢీకొట్టి

- తీవ్ర గాయాలతో యువకుడు మృతి
- గౌరారంలో విషాదం



కిష్టారెడ్డి (ఫైల్)




ఘటనా స్థలంతో దెబ్బతిన్న కారు

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదం ఓ కుటుంబానికి పుత్రశోకం మిగిల్చింది. కారు చెట్టుకు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన విషాదకర ఘటన ఆదివారం రాత్రి వర్గల్ మండలం గౌరారం శివారులో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన భూంరెడ్డి భూపాల్‌రెడ్డి–ఉమ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఆదివారం రాత్రి తమ కుమారుడు కిష్టారెడ్డి(20) కారులో వర్గల్‌కు వెళ్లి వస్తున్నాడు. రామక్కపేట–గౌరారం రోడ్డు మార్గంలో వస్తుండగా కారు గౌరారం శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కిష్టారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసి వెంటనే తండ్రి అక్కడికి చేరుకున్నాడు. స్థానికుల సాయంతో కిష్టారెడ్డిని చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎదిగిన కుమారుడు మృత్యుపాలవడంతో తల్లిదండ్రులు, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. సోమవారం మృతుడి తండ్రి భూపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి..

తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి



నరేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): టీవీఎస్ మోపెడ్ ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం మీనాజీపేట శివారులో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మీనాజీపేటకు చెందిన మంగలి నరేశ్(35)కు భార్య వరలక్ష్మి, 14 ఏళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. వృత్తి పనిలో భాగంగా సోమవారం మనోహరాబాద్ మండలం రంగాయిపల్లికి టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని ఇంటికొస్తుండగా గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాయికోడ్(అందోల్): మండలంలోని నల్లంపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పలువురు గ్రామ శివారులోని ఎం.ఆనంద్ చేనులో కుళ్లిపోయిన మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మృతదేహం పాక్షిక అస్థి పంజరంగా మారిందని, చనిపోయి వారం రోజులు గడిచి ఉంటుందని నిర్ధారించారు. మృతుడు వైట్ కలర్ షర్ట్, దోతి ధరించినట్లు, బట్టతల, వైట్ కలర్ వెంట్రుకలతో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాల కోసం విచారణ ప్రారంభించామన్నారు.



కుస్తీ మే సవాల్



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కల్హేర్(నారాయణఖేడ్‌): కల్హేర్‌లో భద్రప్ప స్వామి జాతరలో సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు విశేషంగా అలరించాయి. పోటీలో విజేతకు 5 తులాల వెండి కడియాన్ని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్సుల పోచయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ.సర్దార్, మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ ఫహీం, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, ఎం.వీర్‌శెట్టి, నాయకులు బేగరి సాయిలు, వడ్ల అనిల్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- నరం తెగడంతో విరిగిన కాలు
- టేక్మాల్‌లో ఆలస్యంగా వెలుగులోకి..



పోలీస్ స్టేషన్‌లో బాలుడితో కుటుంబ సభ్యులు

టేక్మాల్(మెదక్‌): ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదడంతో అతడి కాలు విరిగింది. ఈ ఘటన టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దనూర ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దనూర గ్రామానికి చెందిన బందరుగల్ల అనిత, కుమార్‌ల కుమారుడు మనోహర్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. రెండు నెలల కిందట విద్యార్థి మనోహర్ అల్లరి చేస్తున్నాడని ఉపాధ్యాయుడు చంద్రప్రకాశ్ కర్రతో చేతికి కొట్టగా, మరోసారి విద్యార్థి భయంతో చేతిని వెనక్కి తీసుకోవడంతో కాలు నరానికి తగిలింది. దీంతో బాలుడు సరిగ్గా నడవలేదు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా నరం దెబ్బతిన్నదని తెలిపారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు అప్పట్లో రూ.10 వేలు ఆస్పత్రి ఖర్చులకు ఇచ్చాడు. అయినా తగ్గకపోగా రెండు నెలలుగా ఆస్పత్రిలో రూ.8 లక్షల వరకు ఖర్చు అయిందని, మిగితా ఖర్చులు చెల్లిస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులను ఆశ్రయించి ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయుడిని కౌన్సిలింగ్‌కు పిలువగా ఆయనకు అండగా ఉపాధ్యాయ సంఘ నాయకులు నిలిచారు. ఆయన కొడితే అలా కాలేదని చెప్పడం గమనార్హం.

పట్టించుకోని అధికారులు

నెల రోజుల కిందట సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. పదిరోజుల కిందట మూడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని సైతం ఉపాధ్యాయుడు చితకబాదాడని గ్రామస్తులు వాపోయారు.

కూలీలకు ఉపాధి కల్పించాలి



ప్రజావేదికకు హాజరైన అధికారులు

- అడిషనల్ డీఆర్‌డీఓ బాలకిషన్

నంగునూరు(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ నియమ, నిబంధనలు పాటించి కూలీలకు ఉపాధి కల్పించాలని అడిషనల్ డీఆర్‌డీఓ బాలకిషన్ అధికారులకు సూచించారు. సోమవారం నంగునూరులో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంపై ఓపెన్ ఫోరం నిర్వహించి 2022–23 సంవత్సరానికి గాను మండలంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీపై చర్చించారు. రూ.6.24 కోట్ల లేబర్, రూ.35 లక్షల మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి పనులు జరిగాయని, అధికారులు ఎప్పటికప్పుడూ తనిఖీలు చేయడం లేదని, కూలీల వివరాలు, చేపట్టిన పనులు, మస్టర్లు సరిగా లేవని తనిఖీ బృందం సభ్యులు తేల్చి చెప్పారు. చాలా గ్రామాల్లో పనుల వివరాలు నమోదు చేయకపోవడంపై అధికారులు టీఏలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ.. నంగునూరు మండలంలో పనులు చక్కగా నిర్వర్తించారని, చిన్న, చిన్న తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ ఎండీ ఆరీఫ్, ఏపీఓ ప్రభాకర్, క్యూసీ సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్, ఎస్‌ఆర్‌పీ, డీఆర్‌పీలు, వివిధ గ్రామాల టీఏ, ఎఫ్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

అల్లం.. లాభాలు ఘనం



జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న అల్లం పంట

సాగుకు అనువైన సమయం ఇదే

- ఖర్చు అధికం, అదే స్థాయిలో దిగుబడి చేతికి
- రైతులు మెలకువలు పాటించాలి
- జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి



జహీరాబాద్ టౌన్‌: అల్లం.. ఖరీదైన పంట. పేదోడి నుంచి లక్షాధికారి వరకు ప్రతి రోజూ కూరల్లో వాడే సుగంధ ద్రవ్యం. అన్ని కాలాల్లో డిమాండ్ ఉండడంతో మార్కెట్‌లో ఎప్పుడూ మద్దతు ధర లభిస్తుంది. అందుకే రైతులు అల్లం సాగువైపు ఆసక్తి చూపుతారు. సారవంతమైన ఎర్ర నేలల్లో అల్లం పంట దిగుబడి అధికంగా ఉంటుంది. ఎనిమిది నెలలకు చేతికొచ్చే అల్లం పెట్టుబడి అధికంగా ఉంటుంది. ఎకరానికి లక్ష వరకు ఖర్చవుతుంది. దిగుబడి కూడా అదేస్థాయిలో ఉంటుంది. ధర కలిసొస్తే గిట్టుబాటవుతుంది. ఏప్రిల్ చివరి వారం నుంచి మే నెల వరకు అల్లం సాగుకు అనుకూలం. ఎనిమిది నెలల్లో చేతికొచ్చే అల్లంను సేంద్రియ ఎరువుతో సాగుచేస్తూ యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు.

విత్తనం రకాలు

- మారన్, సుప్రభ, సురుచి, సురభి, వైనాడ్, నదియా, రియోడిజనీరో రకాలు ఎక్కువ దిగుబడి ఇస్తాయి. జహీరాబాద్ ప్రాంత రైతులు అధిక శాతం మంది మారన్ రకం పండిస్తున్నారు.
- ఆరోగ్యవంతమైన తల్లి మొక్క నుంచి విత్తనం సేకరించాలి.
- విత్తనం పొడుగు 4.5 సె.మీ, 30 గ్రాముల బరువు రెండు నుంచి మూడు కన్నులుండాలి.
- విత్తన దుంపలు 10 రోజుల ముందు నుంచి 24 గంటలు నానబెట్టడం వల్ల మొలక శాతం పెరుగుతుంది.
- 500 గ్రాముల ఎం 45 మందును తగినంత నీటిలో కలిపి అల్లం విత్తనం నానబెట్టాలి.
- అల్లం విత్తనం నుంచి చిన్న చిన్న మొలకలు వచ్చేంత వరకు దాదాపు రెండు రోజుల పాటు ఆరబెట్టాలి. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల విత్తనం అవసరం.

సాగు విధానం

- సారవంతమైన ఎర్ర, నల్ల రేగడి నేలలు అల్లం సాగుకు అనుకూలం. పొలాన్ని లోతు వరకు దున్ని దుక్కి చేసుకోవాలి.
- ఎకరానికి 10 టన్నుల పశువుల (సేంద్రియ) ఎరువు, 300 నుంచి 500 కిలోల వేప పిండి, 200 గ్రాముల సింగల్ సూపర్ ఫాస్పెట్ 25 గ్రాముల మైక్రో న్యూట్రిన్స్ కలిపి తయారు చేసిన బెడ్‌పై వేయాలి.
- బెడ్‌ను తడిగా చేసి ముందుగా సిద్ధం చేసుకున్న విత్తనం నాటాలి. క్రమం తప్పకుండా నీటి తడులను పెడుతుండాలి. డ్రిప్ విధానం చాలా మంచిది.

తెగులు నివారణ

- రైజోమ్‌వాట్ తెగులు ఆశిస్తే మొక్క ఎండిపోతుంది. ఆకులు పసుపు రంగుగా మారుతాయి. ఈ తెగులు ఆశిస్తే మాటల్ ఎక్సిల్ 2 కి.గ్రా మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- రైజోమాప్లే తెగులు సోకితే అల్లం కుళ్లిపోతుంది. ఎకరానికి 4 కిలోల ఫ్లోరైడ్ గ్రానివల్స్‌ను వేయాలి.
- లీఫ్ బైట్ తెగుల కారణంగా ఆకులపై చిన్న చిన్న మచ్చాలు ఏర్పడుతాయి.

ఖర్చు, ఆదాయం ఎక్కువ..

అన్ని జాగ్రత్తలు తీసుకొని పంట సాగుచేస్తే ఎకరానికి 100 క్వింటాళ్ల అల్లం దిగుబడి వస్తుంది. కిలో రూ.100 అనుకున్నా క్వింటాల్‌కు రూ.వేలు, వంద క్వింటాళ్లకు రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరానికి రూ. 6 లక్షల వరకు మిగులుతాయి. పంట చేతికి వచ్చే సమయంలో మార్కెట్‌లో రూ. 50 కిలో అల్లం ఉంటే కనీసం రూ.3 లక్షల వరకు మిగులుతుంది.